ఉదయం ఆరుగంటలైంది. అరుంధతమ్మ ఇంట్లో గంట మ్రోగింది. ఈరోజు పూజాది కార్యక్రమాలు త్వరత్వరగా ముగించుకోవడానికి కారణం లేకపోలేదు. దాదాపు నాలుగు సంవత్సరాల తర్వాత చిన్నకొడుకు అమెరికా నుండి వస్తున్నాడు. ఏడు గంటలైనా పనిమనిషి ఇంకా రాలేదు.

# పశ్చాత్తాపం

'ఏమైందో ఏమో! మనకు అవసరం ఉన్న రోజే రోగాలు, రొప్పులు అంటూ డుమ్మా కొట్టేస్తుంటారు పనిమనుషులు' అనుకుంటూ తనలో తానే గొణుక్కుంది అరుంధతమ్మ.

'కనీసం పద్మ వాళ్ల పని మనిషినైనా పిలుద్దాం' అనుకుంటూ ప్రక్క కాంపౌండులోకి వెళ్లింది. అప్పుడే బట్టలు ఉతికి ఆరవేస్తున్న 'ఆమె'ను చూసి కొయ్యబారిపోయింది.

'ఈమె సుమిత్ర? ఇక్కడికెట్లా వచ్చింది? అసలి న్నాళ్లూ ఎక్కడుంది? ఆ ముఖాన బొట్టు లేదేమిటి? కొంపదీసి...'ఇంక ఆపైన ఆలోచించలేకపోయింది. వెంటనే 'ఆమె' వెనుక వైపు నుండి గబగబా అడుగులేసుకుంటూ కనుమరుగైంది.

''రండి! పిన్నిగారూ! మీరా! ప్రొద్దున్నే ఏంటిలా వచ్చారు?'' అంటూ పద్మ బయటకు వచ్చింది.

''ఆ ఏం లేదు... పనిమనిషి...''

''మా పాత పనిమనిషి మానేసింది. అందుకే ఈమెను పెట్టుకున్నాను. పాపం ఎవరూ లేరుట. ఇద్దరు పిల్లలుట. భర్త పోయాడట...'' చెప్పుకుపోతోంది పద్మ.

అంతే! అరుంధతమ్మ కాళ్ల కింద భూమి కదిలినట్లయింది. ఇంట్లోకి వచ్చి కుర్చీలో ఎలా కూలబడిందో ఆవిడకే తెలియదు. గతం కళ్ల ముందు గిర్రున తిరిగింది.

★★★

దాదాపు పద్దెనిమిది సంవత్సరాల క్రితం మాట. చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన అరుంధతికి పుట్టిల్లే ఆధారమైంది. ఏదో చిన్నా, చితకా బట్టలు కుట్టుకుంటూ, తల్లిదండ్రులకు అండగా ఉంటూ ఉన్న ఇద్దరు పిల్లల్నీ కష్టపడి పెంచి పెద్దచేసింది. పెద్దకొడుకు రమణ పదవతరగతి మంచి మార్కులతో పాసయ్యాడు. ఇంక పై చదువులు చదివే స్థోమత లేక ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటూ ప్రైవేటుగా డిగ్రీ చదవాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం అరుంధతి తమ్ముడు ప్రసాద్‌ను సహాయం చేయుమని అర్థించింది. తమ్ముడు అందుకు అంగీకరించినా స్వతహాగా గర్విష్టి అయిన సుమిత్ర ససేమిరా మా వల్ల కాదని



ఖరాఖండీగా చెప్పేసింది. దిక్కుతోచని స్థితిలో ఆ భగవంతుడినే నమ్ముకుంది అరుంధతి. ఊరి పంతులుగారి కొడుకు దయతలచి తన పిల్లలిద్దర్నీ పైకి తీసుకురావటం, ఆ పైన వారు మంచి మార్కులు సాధించి స్కాలర్‌షిప్పులతో చదువు పూర్తి చేసి ఉన్నత స్థితిలోకి రావటం జరిగింది.

ఇంటిముందు కారు హారన్ వినపడటంతో ఈ లోకంలోకి వచ్చింది అరుంధతమ్మ.

''అమ్మా! కులాసానా?'' ఆప్యాయంగా పలకరించాడు చిన్నకొడుకు రమేష్.

''అత్తయ్యా బావున్నారా?'' అంటూ కారు దిగి నిరాడంబరంగా ఉన్న కోడలిని చూస్తూ ఉండిపోయింది అరుంధతమ్మ.

★★★

ఆ రోజు సాయంత్రం పెరట్లో అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

''అమ్మా! ప్రొద్దుట్నించి చూస్తున్నాను. నువ్వు అదోలా ఉన్నావు. ఏమైందమ్మా?'' అనుమానంగా అడిగాడు రమేష్.

''ఏం లేదు నాన్నా! బాగానే ఉన్నానుగా'' కప్పిపుచ్చుకోవటానికి ప్రయత్నించింది అరుంధతమ్మ.

''లేదమ్మా! నీలో కచ్చితంగా మార్పు కనిపిస్తోంది. ఏమైంది?'' అంటూ కొడుకు చనువుగా అడిగేసరికి ఇక ఉండబట్టలేక ఉదయం తాను చూసిన విషయం చెప్పేసింది. అంతేగాక మామయ్య పిల్లల్ని మనమే ఒక దారికి తీసుకురావాలని కూడా చెప్పింది.

''ఏంటమ్మా! నువ్వనేది? మామయ్య పిల్లల విషయంలో మనమెందుకు జోక్యం చేసుకోవాలి?'' అన్నాడు చిన్నప్పటి అత్తయ్య సాధింపులు గుర్తు చేసుకుంటూ.

''అలా అనకు కన్నా! ఏదో భగవంతుని దయ వలన మీరిద్దరూ వృద్ధిలోకి వచ్చారు. నాకదే పది వేలు. మనం ఒకరికి సహాయం చేస్తే ఆ దేవుడు వేరొకరి రూపంలో మనకి సహాయం చేస్తాడు.

చెడు అనేది మనతో సహా ప్రతివారిలోనూ ఉంటుంది. ప్రతివారిలోనూ మంచినే చూడగలిగితే సంఘర్షణకు, శత్రుత్వానికి తావే ఉండదు. మరో మనిషి ఆసరా లేకుండా ఈ ప్రపంచంలో ఏ ఒక్కరూ ఒంటి చేత్తో విజయం సాధించడం కాదుగదా కనీసం మనుగడ కూడా సాగించలేరు'' అంటూ తల్లి చెప్తున్న మాటలు విని మౌనంగా బయటకు నడిచాడు రమేష్.

ఇంటిముందు కారు ఆగడం చూసి గబగబా లోపలికి వెళ్లి తలుపుచాటున నిల్చుంది సుమిత్ర.

ఆడపడుచు లోపలికి రాగానే ''వదినా'' అంటూ బావురుమంది.

''వదినా! నాలోని అహంకారంతో నిన్ను, నీ పిల్లల్ని నానా మాటలు అన్నాను. ఈ రోజు అనుభవిస్తున్నాను. మీ తమ్ముడు పోయిన నాటి నుండి నన్ను నా పిల్లల్ని ఆదరించిన వారే లేరు. పిల్లలు కూడా పూర్తిగా చెడిపోతున్నారు'' అంటూ ఏడుస్తున్న సుమిత్రను, పిల్లల్ని తీసుకుని తన ఇంటికి బయులుదేరింది అరుంధతమ్మ.

-వి.ఉమశ్రీ (గంగారాం)